క్లుప్తంగా

ఎన్‌ఏసీ శిక్షణలో పాల్గొన్న డీపీఓ



శిక్షణలో పాల్గొన్న డీపీఓ భారతి సౌజన్య

కాకినాడ సిటీ: స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ (ఎస్ ఏసీ) ఆధ్వర్యంలో విజయవాడలో రెండు రోజుల పాటు సాలిడ్ లిక్విడ్ రీసోర్స్ మేనేజ్ మెంట్ (ఎస్ఎల్ఆర్ఎం)పై జరిగిన శిక్షణ కార్యక్రమానికి కాకినాడ జిల్లా నుంచి డీపీఓ భారతి సౌజన్య హాజరయ్యారు. సమ్మిళిత, సుస్థిర ఘన, ద్రవ వనరుల నిర్వహణ, రీసోర్స్ మేనేజ్‌మెంట్ టెక్నిక్‌లు, నీటి వనరుల నిర్వహణలో దేశీ బాతుల పాత్ర, దోమలు, ఎలుకల రహిత స్థానిక సంస్థలు వంటి అంశాలపై రీసోర్స్‌పర్సన్ సి.శ్రీనివాసన్ వివరించినట్టు భారతి సౌజన్య తెలిపారు.

స్మార్ట్ సిటీని గ్రీన్ సిటీగా మారుస్తాం



మొక్కలు నాటుతున్న జోగా రామకృష్ణ తదితరులు

బోట్‌క్లబ్: కాకినాడ స్మార్ట్‌సిటీని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వన్ స్టెప్ టూ వర్డ్స్ సొసైటీ అధ్యక్షుడు జోగా రామకృష్ణ తెలిపారు. తమ సొసైటీ ద్వారా ఇప్పటి వరకు 18 వేలకు పైగా మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తున్నట్టు వివరించారు. కాకినాడ గరల్స్ పాలిటెక్నిక్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జీపీటీ హాస్టల్‌లో పేరుకుపోయిన ముళ్ల పొదల్లను తొలగించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జీపీటీ విద్యార్థులు, సొసైటీ సభ్యులు కలిసి సుమారు 400 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్, ట్రెజరర్ కె.ఆనంద్, వైస్ ప్రెసిడెంట్ కె.నాగమణి, జాయింట్ సెక్రటరీ రామరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్(1978) ద్వారా ఏడేళ్లలో రూ.కోటికి పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం సంస్థ గౌరవాధ్యక్షుడు బాదం బాలకృష్ణ ఆధ్వర్యంలో 17 మంది పేద విద్యార్థులకు రూ.3.33 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఏటా రూ.15 లక్షలతో పేదలకు విద్య, వైద్య రంగాలకు సాయం చేస్తామని వివరించారు. ట్రస్ట్‌కు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ సీమకుర్తి పాపారావు, కార్యదర్శి జగదీష్, కోశాధికారి కల్యాణి, శేషగిరిరావు, అరుణ్ కుమార్, పద్మనాభం, బోడా ఆనంద్, శ్రీరామ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వారాహి పూజలు



అఖండ పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: వారాహి నవరాత్రుల సందర్భంగా అఖిల భారత జ్యోతిష సమాఖ్య, వేద విజ్ఞాన ప్రతిష్ఠానం సంయుక్తాధ్వర్యంలో స్థానిక ప్రతిష్ఠాన కార్యాలయంలో చేపట్టిన హోమ కార్యక్రమాలు, అఖండ పూర్ణాహుతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష పండితుడు ఫణి శర్మ మాట్లాడుతూ వారాహి అమ్మవారి దయ వల్ల సమాజంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవనం సాగిస్తారన్నారు. ఏడాదిలో నాలుగు నవరాత్రులతో పాటు, ప్రతి పౌర్ణమికి ప్రతిష్ఠాన కార్యాలయ ప్రాంగణంలో హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. భక్తులతో పూజాది కార్యక్రమాలను దత్తాత్రేయ శర్మ నిర్వహించారు.

పరిమితి మీరొద్దు

- రసాయన, పురుగు మందులతో చేటు
- అధికంగా వాడొద్దంటున్న వ్యవసాయ అధికారులు, నిపుణులు
- దిగుబడితో పాటు జీవులపైనా దుష్ప్రభావం
- వ్యవసాయ శాఖ అధికారుల సూచనలూ కీలకం

కాకినాడ సిటీ: పంట సాగులో పురుగు మందుల వాడకం ఎక్కువైతే మేలుకన్నా కీడు ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పురుగు మందుల వాడకంపై అవగాహన లేకపోతే రైతులు నష్టపోయే అవకాశం ఉందంటున్నారు. పంట దిగుబడులు కోల్పోయాక కానీ రైతులు వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. ఆయా అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణులు చెబుతున్న వివరాలు ఇలా ఉన్నాయి.

వ్యవసాయ శాఖ ఇప్పటికే పురుగు మందుల సరఫరాపై పలు ఆంక్షలు విధించింది. విచ్చలవిడిగా పురుగు మందుల వాడకాన్ని నియంత్రించాలి. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. పంటలకు పురుగులు ఆశించి నష్టాన్ని కలిగిస్తుంటాయి. వీటి నివారణకు రైతులు నేరుగా పురుగు మందులు కొనుగోలు చేసి, ఎక్కువ మోతాదులో ఎక్కువ సార్లు పిచికారీ చేస్తున్నారు. దీంతో సాగు ఖర్చు పెరుగుతోంది. పంటకు మేలు చేసే మిత్ర పురుగులు నశిస్తున్నాయి. దీనికి తోడు ఇతర జంతువులు ప్రభావితం కావడం, మనిషి ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, తుదకు దిగుబడులూ పడిపోతాయి.

> **జాగ్రత్తలు పాటించాలి**
>
> 
>
> **ఖరీఫ్ సీజన్‌లో పంటలకు చీడపీడలు ఆశించే అవకాశాలు ఎక్కువ. అధికారుల సూచనలు మేరకు మాత్రమే** పురుగు మందులను వినియోగించాలి. విచ్చలవిడిగా మందులు వాడితే దిగుబడిపై ప్రభావం పడుతుంది. తీవ్ర ప్రభావం చూపే రసాయనాలు పిచికారీ చేయొద్దు. పంట ఎదుగుదలపై, దిగుబడిపై ప్రభావం చూపుతుంది.
>
> – ఏవీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప మండలం

పిచికారీ సమయంలో..

- పురుగుల మందును పిచికారీ చేసే ముందు మందు డబ్బాలపై ఉండే సూచనలను పాటించాలి.
- చేనులో పురుగుల తీవ్రతను అంచనా వేసి, నష్ట పరిమితి దాటాక పురుగు మందు పిచికారీ చేయాలి.
- **పురుగుల నివారణకు సిఫారసు చేసిన మందును మాత్రమే వాడాలి.**
- **పంటను ఆశించింది పురుగా లేక తెగులా అనే విషయాన్ని కచ్చితంగా గుర్తించాలి.**
- **రైతులకు తెలియకపోతే అధికారులు లేదా శాస్త్రవే**త్తలకు మొక్కలు తీసుకెళ్లి చూపించాలి.
- పురుగుల మందుతో కలుపు మందు కలిపి పిచికారీ చేయరాదు.
- పిచికారీ చేసే స్ప్రేయర్లు, ఇతర పరికరాలు సరిగా ఉన్నాయో, లేదో చూసుకోవాలి.
- స్ప్రేయర్ల పనితీరును, ఎంత ద్రావణం బయటకు వస్తుందో ముందుగానే పరిశీలించాలి.
- మందు ద్రావణం శరీరంపై పడకుండా కాపాడే దుస్తులు, కళ్లద్దాలను వినియోగించాలి.
- మిత్ర పురుగులు తగిన సంఖ్యలో ఉన్నప్పుడు పిచికారీ మందులను వాడాల్సిన అవసరం ఉండదు.
- పురుగు మందును సరైన మోతాదులో తీసుకుని, నిర్దేశిత నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



వరి పంటపై చీడపీడల మందును పిచికారీ చేస్తున్న రైతు

- మందు ద్రావణం పిచికారీ చేసేటప్పుడు కళ్లలో, నోటిలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పిచికారీ చేసేటప్పుడు చిన్న పిల్లలు ఆ ప్రాంతంలోకి రాకుండా జాగ్రత్త పడాలి.
- సక్రమంగా పని చేయని, లీకేజీలు ఉండే స్ప్రేయర్లను వాడరాదు.
- పిచికారీ చేసిన తర్వాత స్ప్రేయర్లను శుభ్రంగా కడగాలి.
- మందు డబ్బాలను పొలం పరిసరాల్లో వదలకుండా, నాశనం చేయాలి.
- ఆహార పదార్థాల సమీపంలో పురుగు మందులను ఉంచరాదు.
- పిచికారీ సమయంలో ఎవరూ బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- పిచికారీ తర్వాత చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, ముఖాన్ని తాకరాదు.
- భోజనం చేసే సమయంలో చేతులను శుభ్రం చేసుకోవాలి.
- ఎవరైనా పురుగు మందు ప్రభావానికి గురైతే వెంటనే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి.
- క్రిమి సంహారక మందులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి.
- గాలి వీచే దిశకు ఎదురుగా పిచికారీ చేయరాదు.

ప్రస్తుత సాగు పరిస్థితి ఇదీ..

కాకినాడ రూరల్, కరప మండలాల్లో, కాకినాడ సిటీ నియోజకవర్గంలో సుమారు 8,300 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు కొవ్వూరు, తిమ్మాపురం, పండూరు, నేమాం, కరప, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, యండమూరి, సిరిపురం, వడ్డిపాలెం, అరట్లకట్ట గ్రామాల్లోని 20 శాతం మంది రైతులు వెదజల్లు సాగు చేపట్టారు. కాకినాడ సిటీ పరిధిలోని మేడలైన్ ప్రాంతంలో కొందరు రైతులు వెదజల్లు సాగు నిర్వహిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో రైతులు నారుమళ్లు వేసి, ఊడ్పులు (నాట్లు వేసేందుకు)చదమ్ములు చేస్తున్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, పురుగుమందులను కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో ఉన్న 41 ఆర్బీకేల్లో వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని పండూరు, తిమ్మాపురం, సర్పవరం, కరప, యండమూరు, విజయరాయుడుపాలెం, అరట్లకట్ట, జె.భావారం, పెద్దాపురప్పాడు తదితర ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులు కూడా ప్రత్యేక ఎరువుల దుకాణాలను నిర్వహిస్తూ, రైతులకు కావల్సిన ఎరువులు, పురుగు మందులు సిద్ధంగా ఉంచినట్టు అధికారులు చెబుతున్నారు.

నగరాన్ని విస్తరించాకే మాస్టర్ ప్లాన్

పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి డిమాండ్

బోట్‌క్లబ్: కాకినాడ నగరాన్ని పూర్తిగా విస్తరించిన తర్వాతే మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. గోదావరి నగరాభివృద్ధి సంస్థ గుడా ప్రకటించిన కాకినాడ మాస్టర్ ప్లాన్ నిర్వహణకు ప్రభుత్వం ఆమోదం తెలపడంపై ఆదివారం ఇక్కడ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ నగరాన్ని విస్తరించకుండా మెట్రో కాకినాడ అవుతుందని కలల కిరీటాలు తగిలించడం అత్యంత హాస్యాస్పదంగా ఉందన్నారు. 2002లో ప్రపంచ బ్యాంకు అప్పుతో వచ్చిన గ్రాంటు ద్వారా ఏపీయూఎస్పీ పేరిట కాకినాడలో సిమెంటు రోడ్ల నిర్మాణం జరగ్గా, 2016 నుంచి స్మార్ట్ సిటీ నిధుల పేరిట బాగున్న అవే రోడ్లను మరింత ఎత్తు చేశారన్నారు. సుమారు 25 వేల జనాభా కలిగిన కాకినాడ ఏర్పడి 157 ఏళ్లు దాటినా, నగర విస్తీర్ణం ఒక్క అంగుళం కూడా పెంచలేదన్నారు. స్మార్ట్ సిటీ నిధులు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం నగర జనాభా 3.25 లక్షలు ఉండగా, ప్రస్తుతం 4.25 లక్షలకు పెరిగిందన్నారు. కిక్కిరిసిన నగరంగా 115 మురికివాడలతో కొనసాగుతున్న దుస్థితి ఉందన్నారు. గ్రేటర్ కాకినాడగా పరిసర 37 గ్రామాలను విలీనం చేసేలా నగరాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరాన్ని విస్తరించకుండా, ప్రజల అభీష్టానికి తావు లేకుండా మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే అడవి కాచిన వెన్నెలగా ఉంటుందని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించిన తర్వాతనే మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని, లేకుంటే ప్రజలు ఎంతమాత్రం సహకరించరని పునరుద్ఘాటించారు.

ప్రేక్షకులను ఆకట్టుకున్న 'క్షేత్రం'

ముగిసిన నాటికల పోటీలు



క్షేత్రం నాటికలోని సన్నివేశం

బోట్‌క్లబ్: ఇద్దరు ఆడపిల్లలు పుట్టారనే నెపంతో భార్యను ఇబ్బందులకు గురి చేసే కథతో సాగిన క్షేత్రం నాటిక ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంది. అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో నిర్వహిస్తున్న నాటికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ వారు ప్రదర్శించిన క్షేత్రంలోని నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. తన కూతురు చదువుకుని ఉద్యోగం చేస్తానంటే వద్దని వారించి, మంచి సంబంధమని చెప్పి పెద్దలు పెళ్లి చేస్తారు. అయితే ఇద్దరు ఆడపిల్లలు పుట్టారంటూ భార్యాబిడ్డలను వేధించిన వ్యక్తికి బుద్ధి చెప్పేందుకు మామగారు నాటకం ఆడతారు. తుదకు బుద్ధి తెచ్చుకున్న అల్లుడు భార్యాపిల్లలను బాగా చూసుకోవడంతో సమాప్తమవుతుంది. ఇందులో సన్నివేశాలను కళ్లకు గట్టినట్టు కళాకారులు ప్రదర్శించారు. తొలి ప్రదర్శనగా కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారి నాలోన నీవే నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం యెడ్ల గోపాలరావు, మజ్జి జగదీశ్వరికి, పడిదగల శివ సత్యనారాయణకు రంగస్థల విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందించారు. కళాకారులు, గాయకులు సీహెచ్ నరసింహారావు, కె.శ్రీనివాస్, మెహర్‌ప్రసాద్, అనుపమ, బి.హర్షవర్ధన్ వర్మ ఆలపించిన సంగీత విభావరి, మిమిక్రీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపకుడు పంపన దయానందబాబు, అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ విజన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. స్థానిక చల్లా కల్యాణ మండపంలో క్లబ్ కాకినాడ విజన్ నూతన అధ్యక్షురాలిగా ఎంవీఎస్ఎల్ ప్రసూన, కార్యదర్శిగా శ్రీదేవిరెడ్డి, కోశాధికారిగా శ్రీవాణితో లయన్స్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బాదం బాలకృష్ణ మాట్లాడుతూ మహిళలతో ఏర్పాటైన లయన్స్ క్లబ్ విజన్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. గత కొన్నేళ్లుగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ ఎంతో మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. గతేడాది 110 సేవా కార్యక్రమాలతో సమాజ సేవలో లయన్స్ క్లబ్ ఖ్యాతిని ఇనుమడింపజేశారని కొనియాడారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులు ఆశ్రమ శ్రావణి వృద్ధుల ఆశ్రమానికి 50 కిలోల బియ్యం, రెండు సీలింగ్ ఫ్యాన్లు, పేద విద్యార్థులకు నగదు, దీర్ఘకాలిక రోగులకు బియ్యం పంపిణీ చేశారు. నూతన కార్యవర్గాన్ని రమణయ్యపేట మాజీ సర్పంచ్, అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ మాజీ గవర్నర్ విశ్వేశ్వరరావు, ఉప గవర్నర్ కోటేశ్వరరావు, ప్రాంతీయ చైర్మన్ పద్మ తులసి, జోన్ చైర్మన్ నాగమణి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.



నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న ప్రముఖులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కరపలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరప: చాలా ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారు. ఇప్పుడంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరికొకరు ఎదురు పడేసరికి పాత జ్ఞాపకాలన్నీ కళ్ల ముందుకొచ్చాయి. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని.. ఎక్కడుంటున్నావురా, ఏం చేస్తున్నావంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే కష్టాలన్నీ మరిచి.. ఆనంద డోలికల్లో మునిగి తేలారు ఆ పూర్వ విద్యార్థులు. అలనాటి జ్ఞాపకాలను, చేసిన చిలిపి పనులు, అల్లరిచేష్టలు చెప్పుకుంటూ ఒకరినొకరు భార్యా,పిల్లలను పరిచయం చేసుకున్నారు. ఇదంతా కరపలోని పద్మప్రియ ఫంక్షన్‌హాలులో మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న 1988–89 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 70 మంది కలయికతో సందడి నెలకొంది. ఒకరినొకరు పలకరించుకుంటూ, కరచాలనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహితులందరూ కలుసుకుని ఆనాటి ముచ్చట్లు చెప్పుకుంటూ ఉత్సాహంగా , ఉల్లాసంగా గడిపారు. ఆనాటి బ్యాచ్‌కు చెందిన గొర్రెల కామేశ్వరరావు, మిరియాల నరసింహారావు, మేడిశెట్టి మురళి, పెద్దిరెడ్డి గోవిందరాజు, గంధం సతీష్, మంచాల శ్రీనివాస్, త్రిమూర్తులు, రామ్మోహన్ తదితరులు తమతో కలిసి చదువుకున్న విద్యార్థుల చిరునామాలు సేకరించి, వారికి సమాచారం అందించి అందరూ కలిసేలా ఏర్పాటు చేశారు. దాదాపు 35 ఏళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, జ్ఞాపికలు అందజేసి తమ గురుభక్తిని చాటుకున్నారు. ముందుగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేసుకుని, తాము చేస్తున్న ఉద్యోగ ,వ్యాపారాలను, పిల్లల చదువులను వివరించుకున్నారు. ఏటా ఇలాగే కలుసుకుని, ఆనందంగా గడపాలని నిర్ణయించుకున్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30కు నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. నగరంలోని శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరిస్తామన్నారు. అంతకుముందు ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయ నంబర్ 0884–2357800కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని వివరించారు. ఆయా కార్యక్రమాల ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని చెప్పారు. ప్రజల విజ్ఞాపనలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన వైద్య విద్యార్థుల సదస్సు



విజేతలకు బహుమతులు ఇస్తున్న డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: వైద్య విద్యార్థుల విజ్ఞాన వేడుక ఎరివ్నా ఆదివారం ముగిసింది. రాష్ట్ర డీఎంఈ డాక్టర్ నరసింహం, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవిలు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. జనరల్ సర్జరీ, నియోనటాలజీ, సీపీఆర్, న్యూరో్ట్రామా ఎసెన్షియల్స్, కమ్యూనిటీ మెడిసిన్ వర్క్ షాప్‌లు, ఏబీజీ ఇన్‌స్ట్రుమెంటల్, మాలిక్యులార్ బయోలజీ, తదితర అంశాలపై 23 విభాగాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఎరివ్నా కోర్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సందీప్ వర్మ అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. కల్చరల్ సెక్రటరీ డాక్టర్ శైలజా రాణితో పాటు డాక్టర్లు ఉమామహేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, పాండురంగ విఠల్, శివకల్యాణి, మనోజ్, మహాలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

కొత్తగా వచ్చి.. చెత్తగా మారి..

ప్రజల కష్టార్జితంలో కొంత సొమ్ము పన్నుల రూపేణా ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. దాంతో ప్రజోపయోగ కార్యక్రమాలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిది. ఈ మేరకు ప్రజా సొమ్ముతో కొనుగోలు చేసిన వాహనాలు.. కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మూలనపడ్డాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ప్రభుత్వ వాహనాలు వినియోగానికి నోచుకోకుండా.. అక్కరకు రాని ఇనుప ముక్కలుగా మారుతున్నాయి.

- మున్సిపాలిటీలకు సెప్టీ క్లీన్ ట్యాంకర్లు
- ఐదు నెలల నుంచి నిరుపయోగంగానే..
- గతంలో మినీ ట్రాక్టరుదీ ఇదే దుస్థితి
- స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరేనా..!



సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సెప్టీ క్లీన్ ట్యాంకరు




సామర్లకోట మెప్మా కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పారిశుధ్య మినీ వాహనాలు

సామర్లకోట: మున్సిపాలిటీలకు చేరిన సెప్టీక్లీన్ ట్యాంకర్లు నిరుపయోగంగా పడి ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సుమారు ఐదు నెలల క్రితం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలకు సెప్టీక్లీన్ ట్యాంకులు వచ్చాయి. మున్సిపాలిటీలకు ఈ ట్యాంకులు వచ్చిన తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో, వాటిని ప్రారంభించకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దాంతో స్వచ్ఛాంధ్ర లక్ష్యం కుంటుపడుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతి మున్సిపాలిటీలో ఉన్న బహిరంగ మరుగుదొడ్ల స్థానంలో సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. దీనికితోడు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను మరుగుదొడ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ రావడంతో, ప్రతి సచివాలయంలోను మరుగుదొడ్లను నిర్మించారు. ఇటువంటి తరుణంలో ఆయా మరుగుదొడ్లకు చెందిన సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసేలా ఈ సెప్టీక్లీన్ ట్యాంకర్లను సమకూర్చారు. దీనికి సంబంధించి నియమనిబంధనలు అందలేదనే సాకుతో వాటిని ప్రారంభించకుండానే నిరుపయోగంగా వదిలివేశారు.

వాహనాలపై ఏదీ శ్రద్ధ !

మున్సిపాలిటీలకు మంజూరవుతున్న వాహనాలపై అధికారులకు కనీస శ్రద్ధ ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీ ప్రారంభం నుంచి ఇదే పరిస్థితి తలెత్తుతుందని అంటున్నారు. కలెక్టరుగా సతీష్‌చంద్ర ఉన్న సమయంలో మున్సిపాలిటీకి వచ్చిన మినీ ట్రాక్టరును ఉపయోగించకుండానే ఇనుప ముక్కగా విక్రయించిన సంఘటనను ప్రజలు ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన తొమ్మిది మినీ పారిశుధ్య వాహనాల్లో ఆరు వరకు అధికారులు నిరుపయోగంగా వదలేశారనే విమర్శలూ ఉన్నాయి. వీటికి స్వల్ప మరమ్మతులు రావడంతో.. వినియోగించకుండానే వదిలివేశారు. దాంతో అవి కూడా ఇనుప ముక్కలుగా మారే అవకాశం లేకపోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టరు నిర్లక్ష్యం కారణంగానే వీటిపై శ్రద్ధ కరువైందని అంటున్నారు.

> **ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రారంభిస్తాం**
>
> 
>
> మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సెప్టీక్లీన్ ట్యాంకరు వాహనం వచ్చింది. తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని ప్రారంభించడానికి అవకాశం లభించలేదు. వాహనం వినియోగానికి సంబంధించి గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి, ఈ వాహనం వినియోగంలోకి తీసుకువస్తాం. మినీ శానిటేషన్ వాహనాలు సరఫరా చేసిన కంపెనీకి వాటి మరమ్మతుల కోసం సమాచారం ఇచ్చాం.
>
> – జాస్తి రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

సూర్యారావుపేట బీచ్‌లో స్వచ్ఛత పఖ్వాడ



సూర్యారావుపేట బీచ్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న ఈడీ రత్నేష్ కుమార్, సిబ్బంది

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట గ్రామ పరిధిలోని ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం ఉదయం ఓఎన్‌జీసీ అధికారులు స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో కలిసి బీచ్‌లోని చెత్తను తొలగించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు ప్లాస్టిక్ వ్యర్థాలు విడిచిపెట్టడం వల్ల అవి సముద్రంలో కలిసి జల కాలుష్యంతో పాటు, జీవరాశులకు ప్రాణాపాయం తలెత్తుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం తీర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమం–2024లో భాగంగా కాకినాడ తీర ప్రాంతంలోని ఎన్టీఆర్ బీచ్‌లో వ్యర్థాలు తొలగించామన్నారు.